ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

# సిలికాన్‌వేలీలో 'అన్నమాచార్య సంకీర్తనోత్సవం'



ఇంటర్నెట్‌డెస్క్ : సిలికాన్‌వేలీలో ప్రవాసాంధ్రులు 'అన్నమాచార్య సంకీర్తనోత్సవా'న్ని జనవరి 20న ఘనంగా జరుపుకున్నారు. సిలికానాంధ్ర-సన్నివేల్ దేవాలయం(హిందూ కమ్యూనిటీ సెంటర్) సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలిఫోర్నియా రాష్ట్రం నుంచి వందలాదిమంది శాస్త్రీయ సంగీతాభిమానులు పాల్గొన్నారు. హిందూ కమ్యూనిటీ సెంటర్‌అంతా అన్నమాచార్య కీర్తనలతో నిండిన బ్యానర్లు.. రంగురంగుల జెండాలతో పండగ వాతావరణం సంతరించుకుంది. సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సుమారు 116 అన్నమయ్య కృతులను ఆలపించారు.

చెరుకువల్లి గణేష్‌శర్మ వేదపఠనం మధ్య సిలికానాంధ్ర అధ్యక్షులు విస్సంరాజుశ్రీఫణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య పదానికి మరింత ప్రాచుర్యాన్ని తేవడానికి అకుంఠితదీక్షతో కృషి చేస్తామన్నారు. త్వరలో ఈ కార్యక్రమాన్ని భారత్ అంతటా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 40 మంది కళాకారులు గోష్ఠిగానంలో ఆలపించిన అన్నమాచార్యుని ఏడు ప్రముఖ కీర్తనలు ప్రేక్షకులకు వీనులవిందు చేశాయి. మూడువందల మందికి పైగా గాయనీగాయకులు, నర్తకీనర్తకులు, వాద్యకారులు ఒక్కొక్కరుగా, బృందాలుగా అన్నమయ్య కీర్తనలను తమదైన శైలిలో ఆలపించి ప్రేక్షకులను మైమరపింపచేశారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కేవీ రమణాచారి 'సిలికానాంధ్ర' సాంస్కృతిక రంగంలో చేస్తోన్న కృషిని అభినందించారు. సిలికానాంధ్ర కృషివల్ల అనేక విజయాలు లభిస్తున్నాయని అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ మేడసాని మోహన్ దూరవాణి సందేశంలో తెలిపారు. సుమారు 150 అన్నమయ్య కృతులకు స్వరకల్పన చేసే బాధ్యతను సిలికానాంధ్రకు అందిస్తున్నామన్నారు. కూచిబోట్ల ఆనంద్ ప్రసంగిస్తూ అఖిలభారత అన్నమాచార్య ఉత్సవానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందని... రాష్ట్రంలో ప్రతి జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సిలికానాంధ్ర కార్యకర్తలు స్వయంగా వండి వడ్డించిన విందుభోజనాన్ని అందరూ ఆరగించారు. అహోరాత్రులు శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి కృషిచేసిన సిలికానాంధ్ర కార్యకర్తలు హేమ కోట, వైజయంతి సువర్ల, శ్రీహరిశాస్త్రి, శ్రీలక్ష్మికోలవెన్ను, గాయత్రి అవ్వారి, రవి కూచిబొట్ల, రవిచివుకుల, అనంత్‌రావు, మృత్యుంజయుడు, అన్నం అనిల్ తదితరులను అందరూ అభినందించారు.

## అన్నమాచార్య రాగరాగిణి

సిలికానాంధ్ర ప్రస్థానంలో మరో మైలురాయిగా 'అన్నమాచార్య రాగరాగిణి' నిలుస్తుందని సంస్థ అధ్యక్షులు కూచిబోట్ల ఆనంద్ అన్నారు. గత మూడేళ్లుగా సిలికానాంధ్ర చేస్తున్న కృషిని గుర్తించి 'తిరుమల తిరుపతి దేవాస్థానం అన్నమాచర్య ప్రాజెక్టు' వారు అన్నమాచార్య కృతులను స్వరపరిచే బాధ్యతను అప్పగించారని తెలిపారు. 'అన్నమాచార్య రాగరాగిణి' అనే పేరుతో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో స్వరపరుస్తామని ఆయన వెల్లడించారు.